# అపగతం

"కూర్చో" అన్నాడు మణిలాల్.

స్టూలు ముందుకు లాక్కుని కూర్చున్నాను.

"చెప్పు".

జేబులోంచి కాయితంలో చుట్టిన బంగారు పతకాన్ని తీసి బల్లమీద పెట్టి, "నాకు డబ్బులు కావాలి" చిన్నగా అన్నాను.

అతను పతకాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. కాయితం గాలికి ఎగురుతూ కొట్టు బయటకు వెళ్ళిపోయింది. ఆరు సంవత్సరాల కిందట విశ్వవిద్యాలయం ఇచ్చిన బంగారు పతకం అది. నా దురదృష్టమో, ఏమో అది సాధించాక మరేది సాధించలేకపోయాను. ఏ ఉద్యోగం దొరకలేదు.

"ఎంత కావాలి?" అడిగాడు.

ఇక్కడి నుండి హైదరాబాద్ వెళ్ళడానికి చాలు. దాని ఖరీదు ఎంతుంటుందో నాకు తెలియదు. ఎవరినీ అడగలేదు. దాన్ని అందుకున్న కొత్తలో పడిన ఆనందం ఇప్పుడు ఏ మాత్రం లేదు. ఏ దారీ లేక అతని దగ్గరకు తీసుకువచ్చాను. నాలా ఎవరూ తమకు వచ్చిన పతకాలను అమ్ముకుంటారని అనుకోను. ప్రస్తుతం నాకు డబ్బులు కావాలి. నాన్నను ఆడగాలనిపించడం లేదు. ఆయన దగ్గర ఉన్నాయో లేదో తెలియదు. ఇప్పటికే ఆయన దగ్గర చాలా తీసుకున్నాను. పరీక్ష ఫీజులకు, ఇంటర్వ్యూలకు నాన్న ఎంతో ఖర్చుపెట్టాడు. నాకు ఏదయినా ఉద్యోగం వస్తుందని అనుకోవడం మానేసి ఉండాలి.

"చెప్పు, ఎంత కావాలి?" అడిగాడు మణిలాల్. అతను ఎంత మెతకగా కనిపిస్తుంటాడో అంత కరుకుగా వ్యవహరిస్తుంటాడు. నాకతను చాలాకాలం నుండి తెలుసు. అతని దగ్గరకు రావడం అదే మొదటిసారి.

"దీనిమీద ఎంతివ్వగలవు?"

"అమ్ముతావా, తాకట్టు పెడతావా?"

తాకట్టు పెడితే విడిపించుకోగలనో, లేనో? నా భవిష్యత్ గురించి కలలు కనడం మానేశాను.

"అమ్ముతాను. ఎంతొస్తుంది?"

చెప్పాడు. "నువ్వని అంతిస్తున్నాను" అన్నాడు.

చాలా తక్కువ చెబుతున్నట్లు అనిపించింది. అతను తప్ప చుట్టుపక్కల నాకు తెలిసిన మరొక మార్వాడీ లేదు. కొత్తవాడి దగ్గరకు వెళ్లి చేతులు కట్టుకొని నుంచోవడం నాకు ఇష్టం లేదు. తల అడ్డంగా ఆడించాను.

"ఒక పనిచేయి" అన్నాడు.

"చెప్పు".

"ఇవి మళ్ళీ మళ్లీ రావు. అమ్మకు, తాకట్టు పెట్టు".

అతను చెప్పిన మాట సబబుగా అనిపించింది. నేనేమీ అనకముందే పతకం బీరువాలో పెట్టుకుని బల్ల సొరుగులోంచి డబ్బు తీసి ఒకటికి మూడుసార్లు లెక్కపెట్టి ఇచ్చాడు. నేను మళ్లీ లెక్కపెట్టుకోలేదు. అతను ఇచ్చిన రసీదు అందుకుని లేచి నిలబడి జేబులో పెట్టుకుంటూ గోడ గడియారం వంక చూశాను. ఒకటీ పదయింది. రెండింటికీ హైదరాబాద్ వెళ్లే బండి ఉంది.

ఇంటికి వెళ్ళి సంచిలో రెండు జతలు బట్టలు, నా సర్టిఫికెట్లు పెట్టుకుని వరండాలో పడక కుర్చీలో ఉన్న నాన్న దగ్గరకు వచ్చాను. నాన్న కుర్చీలోంచి లేవడానికి ప్రయత్నించాడు. వీలు కాలేదు.

"హైదరాబాద్‌లో ఇంటర్‌వ్యూ ఉంది. వెళ్తున్నాను" అన్నాను.

"ఎప్పుడు?"

"రేపు."

"ఎల్లుండికల్లా వచ్చేస్తావా?"

"సరే" అని తలూపాను. కాని తిరిగి రాదల్చుకోలేదు. అక్కడే ఉండి ఏ చిన్న ఉద్యోగానికయినా ప్రయత్నం చేసుకుంటాను. ఏదీ దొరకకపోతే ఆటో రిక్షా నడుపుకోడానికి సిద్ధపడే వెళ్తున్నాను.

"నాలుగురోజులు ఆగితే కాని నా పెన్షన్ రాదు..." నిస్సహాయంగా అన్నాడు,. నాకాయన ఎంతో చేశాడు. నేనే ఏం చేయలేకపోతున్నాను.

"నా దగ్గర డబ్బులున్నాయి" అన్నాను.

ఎక్కడివి అని ఆయన అడగలేదు. అడిగితే ఏమని జవాబు చెప్పాలో నేను ఆలోచించలేదు. నాకు పతకం దొరికినందుకు ఆయన ముఖంలో వెలిగిన సంతోషాన్ని నేను ఇప్పటికీ మర్చిపోలేదు. జేబులోంచి రెండు వందలరూపాయలు తీసి ఆయన చేతిలో పెట్టాను. తిరిగి నాకు ఇవ్వబోతూ, "నువ్వు ఊరు వెళ్తున్నావు. అవసరం పడుతుంది. ఉంచుకో" అన్నాడు. నేను తీసుకోలేదు. ఇంట్లో ఏమీ లేవని నాకు తెలుసు. వెనక్కి తిరిగి వీధి తలుపు వయిపు నడవసాగాను.

"మాట"

వెనక్కి తిరగలేదు. నా కళ్లల్లో తిరుగుతున్న నీళ్లు ఆయన చూడడం నాకు ఇష్టంలేదు. నా కన్నీళ్లు ఆయన మనసును బాధిస్తాయి.

స్టేషన్ చేరుకున్నాను. బండి సిద్ధంగా ఉంది. టిక్కెట్ తీసుకుని ఎక్కి మూలగా కూర్చున్నాను. ఎప్పుడూ లేనిది ఈసారి ఎందుకో దిగులుగా ఉంది.

మరుసటిరోజు అదే సమయానికి పబ్లిక్‌స్కూలు ప్రిన్సిపాల్‌కు ఎదురుగా కూర్చుని ఉన్నాను. ఆ స్కూలు హైదరాబాద్ శివార్లలో ఉంది. పెద్ద భవనాల చుట్టూ గుబురాటి చెట్ల మధ్య వున్న ఆ స్కూలు గురించి విన్నాను. చదివాను. కాని చూడడం అదే మొదటిసారి. ప్రశాంతమయిన వాతావరణంలో కొండలకు అతుక్కుపోయినట్లుగా ఉంది. ఉన్న ఒక్క ఉద్యోగానికి నన్ను ఒక్కడినే పిలిచారో లేక మరెవరినయినా పిలిచారో పర్సనల్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకుందామనిపించింది కాని, అడగలేకపోయాను. ఆ పూట పిలిచింది నన్ను ఒక్కడినే.

ప్రిన్సిపాల్‌కు యాభయి సంవత్సరాలుంటాయేమో, సన్నగా, పొడుగ్గా ఛామన ఛాయలో ఉన్నాడు. ఆ స్కూల్‌లో డ్రస్‌కోడ్ పాటిస్తారనుకుంటాను, టీచర్లందరూ టక్ చేసి టైలు కట్టుకుని ఉన్నారు. ఆయన సబ్జెక్ట్ గురించి వివిధ ప్రశ్నలతో నాకు ఊపిరాడనీయడని అనుకున్నాను. కాని అటువంటివేమీ చేయలేదు. నా ఫైలు అందుకుని అరగంటపాటు నా ఒరిజినల్స్ చూసి ఫైలు తిరిగి నాకిచ్చేస్తూ "గుడ్" అని కళ్ళద్దాలు తీసి బల్లమీద పెట్టాడు. ఊపిరి బిగపట్టి ఏం చెబుతాడా అనుకుంటూ ఎదురు చూడసాగాను. ఆయన ముఖంలో ఎటువంటి భావం వ్యక్తం కావడం లేదు. నా ఆశ పూర్తిగా చనిపోలేదు. కొన ఊపిరితో ఉంది.

ఆయన కుర్చీలో చేరగిలబడి కూర్చుని టై కొద్దిగా వదులు చేసుకుంటూ, "మీ గురించి మీరు చెప్పండి" అన్నాడు.

ఏం చెప్పాలో వెంటనే తోచలేదు. నిజంగా మనమంటే ఏమిటో చెప్పుకోవడం తేలికయిన విషయమేమీ కాదు. విశ్వవిద్యాలయంలో బంగారు పతకం సాధించడం మినహా జీవితంలో నేను కోరుకున్నదేదీ పొందలేకపోయాను. నేను ఏది చెప్పినా వినడానికి ఆయన తయారుగా ఉన్నట్టున్నాడు. ఉద్యోగం రాకపోయినా ఏమనుకునే స్థితిలో లేను. నేను ఎక్కడ పుట్టానో, మా నాన్నకు నేను ఎన్నో సంతానాన్నో, నాన్న ఏ ఉద్యోగం చేసేవాడో, నా చదువు ఎప్పుడు ముగిసిందో, ఇంతవరకు నాకు ఏ ఉద్యోగం ఎందుకు దొరకలేదో పూసగుచ్చినట్లు చెప్పి, "అందుకు బాధ్యుడిని నేనే. డిగ్నిటీ ఆఫ్ లేబర్ తెలుసుకోకపోవడం నా తప్పు. ఏ చిన్న పనిచేయడానికయినా అయిదారు సంవత్సరాల కిందటే సిద్ధపడి ఉంటే ఇప్పుడింత బాధపడుతూ ఉండేవాడిని కాదు. సివిల్స్ రాసి విఫలమయ్యాను. నేనెంతో తెలివిగల వాడననే భావన ఒకప్పుడు ఉండేది. చాలామంది కన్నా ఎక్కువ అనే అహం కూడా ఉండేది. ఇప్పుడు ఏం లేవు. ఎంతమందో పడుతున్న కష్టాలతో పోల్చుకుంటే నావి అసలు కష్టాలు కావు. జీవితంలో నెగ్గుకు రాగలనో, లేదో?... అలసిపోతున్నాను...." ఇలా ఇంకా చాలా చెబుదామనిపించింది. కానీ అప్పటికే చాలా చెప్పాననిపించింది. ఆగి, ఆయన ముఖంలోకి చూశాను. ఆయన కళ్ళు మూసుకుని ఉన్నాయి. ఆయన నిద్రలోకి జారిపోయాడో, నా మాటలు విన్నాడో, లేదో అనుకుంటూ ఉండగా,

ఆయన కళ్లు తెరవకుండా, "మీ గోల్డు మెడలు గురించి చెప్పనేలేదు" అన్నాడు.

"నా అహానికి మొదటి కారణం నా గోల్డు మెడలు. అది రాకుండా ఉంటే బావుండేది".

ఆయన కళ్లు తెరిచి కుర్చీలో నిటారుగా కూర్చుని ముందుకు వంగి బల్లమీద మోచేతులుంచి, "ఒకవేళ .. నీకు ఉద్యోగం ఇస్తే జీతం ఎంత కావాలని కోరుకుంటావు?" అడిగాడు.

"మీరు ఎంత ఇచ్చినా తీసుకుంటాను" అన్నాను.

ఆ స్కూల్లో నిలదొక్కుకుని మంచిపేరు సంపాదించుకోడానికి సంవత్సరంన్నర పయిగా పట్టింది. నెలకు మూడువేలతో మొదలయిన జీతం పదిహేనువేల వరకు పెంచారు. అవకాశాలు వచ్చినా వేరే ఉద్యోగాలకు వెళ్ళాలనిపించలేదు. పిల్లలకు పాఠాలు చెప్పి వాళ్ళను తీర్చిదిద్దడంలోని ఆనందం మరి దేంట్లోనూ రాదనిపించింది.

మొదటి సంవత్సరం వేసవి సెలవులకు మా ఊరు వెళ్ళినప్పుడు నా బంగారు పతకం తెచ్చుకునేందుకు రసీదు దొరక పుచ్చుకుని మణిలాల్ కొట్టుకు వెళ్ళాను.

కొట్టు మూసి ఉంది. మణిలాల్ కనిపించలేదు. కొద్దిగా ఇబ్బందిపడి అతని తమ్ముడిని కలుసుకోగలిగాను. మణిలాల్ గురించి అడిగితే, "మా అన్నయ్య షేర్‌మార్కెట్‌లో బాగా దెబ్బతిని తేరుకోలేక, అప్పుల బాధ భరించలేక ఉరేసుకుని చనిపోయాడు. ఆరు నెలలు అయింది" అన్నాడు.

బాధనుండి తేరుకున్నాక కూడా నేను అక్కడి నుండి కదలక పోవడం చూసి, "ఏం కావాలి?" అడిగాడు.

జేబులోంచి రసీదు తీసి అతనికి చూపిస్తూ "నా గోల్డు మెడలు తాకట్టు పెట్టాను" అన్నాను.

ముందు దొరకదన్నట్టు పెదవి విరిచి, హఠాత్తుగా ఏదో గుర్తువచ్చినట్లు, "ఆ మెడలు మీదా?" అడిగాడు.

"యూనివర్శిటీవాళ్ళు...." అంటోంటే నా మాటలకు అడ్డు తగిలి, "నాకు గుర్తుంది. మా బీరువాలో దాన్ని చాలాసార్లు చూశాను. మీరు నమ్మండి. నమ్మకపోండి. అది మావాడి చేతుల్లోకి వచ్చాకే వాడి వ్యాపారం దెబ్బతినడం మొదలైంది....." అన్నాడు.

దురదృష్టం చేతులు మారుతుంటుందని నాకు తెలియదు.

❖ తేజ వారపత్రిక, 6 మార్చి, 2009